# మీసాల మొగుడు

**కా**మేశం కామధేనువులాంటి వాడు! మనిషి మేధకుడు! అయాయక చక్రవర్తి! స్వపరబేధాల్లేని స్వభావం అతగాడిది.

ఇతగాడికో ఫ్లాష్‌బేకుంది.!

టెన్త్‌లోకి గెంతుకొచ్చీ రాకుండానే మూతి మీద నల్లటి వత్తయిన మీసాలు మొలిచాయి! వాటిని చూచి కంగుతిన్నాడు. తన ఈడు కుర్రాళ్లకు నూనూగు మీసాలైన రాలేదు... మరి తనకేంటి అప్పుడే ఇంత సైజులో మీసాలు రావటం అని మథన పడ్డాడు.

ఇంట్లో చూద్దామా అంటే... తాతకు... తండ్రికి... ఇద్దరు అన్నయ్యల్లో ఏ ఒక్కరూ మీసాలు పెంచలేదు.

అందరూ రోజూ క్లీన్ షేవ్ చేసుకుంటూంటారు.

కొంపతీసి వరి నారులాగ ఏపుగ పెరిగిన మీసాలు ఏదైనా అపశకునానికి సంకేతం కాదు కదాని? బెంబేలెత్తాడు. పదిహేనేళ్ళయినా నిండని తనకు పాతికేళ్ళ వాడికొచ్చినట్టు ఇంతంత పెద్ద మీసాలేంటి చెప్మాని వాపోయాడు. కామేశం మూతిన మీసాలు చూచిన ఇంట్లో వాళ్లు కలవరపడ్డారు.

అప్పుడే ఈ వెధవాయ్‌కి బ్లేడ్లు.. రేజర్లుకొని పెట్టాలి కాబోలు... నెల నెలా బ్లేడ్ల ఖర్చొకటి. మగవెధవలు పుడితే ఇదే ఖర్చు... గొణుక్కున్నాడు తండ్రి శ్రీనివాసరావు.

రోజూ నిలువుటద్ధం ముందు నిలబడి వయసొచ్చిన ఆడపిల్ల పైట నిముషానికి వందసార్లు సరి చేసుకున్నట్టు.... కామేశం కూడా మీసాలు చూచుకుమురుస్తూ... చిరునవ్వులొలక పోస్తూ ఉండటం గమనించిన శ్రీనివాసరావుకు ఒకరోజు వళ్ళు మండి....

'మీసాలకేం?... ఎరువులతో పనిలేకుండా పెరిగే పూల మొక్కల్లా వద్దన్నా మొలిచి పెరుగుతూంటాయ్! చదువుకోవటానికి కష్టపడాలి గాని... మీసాలు దువ్వుకోవటానికి కష్టపడనక్కర్లేదు..." తండ్రి పెట్టిన చీవాట్లకు కామేశం మొహం నీళ్ళు లేని కలుపు మొక్కలా వాడిపోయింది.

ఛీ! వెధవ మీసాలు అప్పుడే మొలిచి చావాలా?... డాడీతో తిట్లు

తినిపించాలా? వీటికి బొత్తిగ బుద్ధి లేదు... తనను తాను నిందించుకుంటూ అద్ధం ముందు నుండి తుర్రుమని హాల్లోకి పరుగెత్తుకెళ్ళాడు.

'వెళ్లు... వెళ్ళి పుస్తకాలు ముందేసుకుని చదివేడు. ఎగ్జామ్స్ దగ్గరకొస్తున్నయ్. మంచి మార్కులతో పాసైతే ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుంది గానీ... అద్ధం ముందు గంటల తరబడి మీసాలు వివిధ భంగిమల్లో తిప్పుకుంటూంటే ఏం ప్రయోజనం ఉండదు....' స్వరం పెంచి అనదల్చుకున్న నాలుగు మాటలు అనేశాడు శ్రీనివాసరావు.

అవకాశం తీసుకుని మరీ దెప్పి పొడుస్తున్నాడు శ్రీనివాసరావు.

తండ్రి తిట్టినందుక్కాకపోయినా... రాకూడని వయసులో మీసాలొచ్చి తనను ఇబ్బంది పెడుతున్నందుకు కామేశం రోషపడ్డాడు. మీసాలు తిప్పటం మానేసి మనసు చదువు మీదే లగ్నం చేయాలనే భీషణ ప్రతిన పూనేడు.

ఓరోజు- పళ్ళు బ్రష్ చేసుకుంటున్న కామేశాన్ని చూస్తూ 'రౌడీ వెధవలాగ మీసాలు పెంచటం మనింటా వంటా లేదు. ఈ వెధవకి ఎలా దాపురించిదో-ఇంద! ఈ డబ్బు తీసుకుని బార్బర్ షాపుకెళ్ళి మూతి మీసాలు తెగ్గోయించుకురా! మీసాల మూతితో నాక్కన్పించావంటే కొంపలో నీకుకూడుండదు. అర్థమైందా?-' గుండ్లురిమి అరిచినట్టు మాట్లాడాడు శ్రీనివాసరావు.

దాడీకి అసలు బొత్తిగ బుర్ర లేదు. మీసం మూతికి అందాన్నిస్తుందనే విషయం తెలీదా ఏంటి? ఓ.. తెగ సతాయిస్తున్నాడు... మనసులోనే వాపోయాడు కామేశం.

ఏది ఏమైనా మీసాలు పెంచుకోవటమే తనకు బాగున్నదన్పించటంతో ధైర్యాన్ని కూడగట్టుకొని 'డాడీ... నాకు మీసాలు పెంచుకోవటమంటే ఇష్టం! పెంచుకోనీయండి... డాడీ' బ్రతిమాలాడు.

'ఛస్... నోర్మూయ్‌రా పిల్ల కుంకా! మీసాలు పెంచే అలవాటు మన వంశంలోనే లేదు. మీసాలు పెంచటం అచ్చిరాకనే.... తాతముత్తాతల కాలం నాడే ప్రతిన పూనారు! అనాదిగ మీసం పెంచకూడదనే ఆచారం మనకు ఆచరణలోకొచ్చింది. నన్ను గాని... మీ తాత గారిని గాని... మీ ఇద్దరన్నయ్యలను చూసైనా అర్థం చేసుకో! మేమందరం క్లీన్ షేవ్ చేసుకోవటం లేదూ?- మాకు లేని మీసం నీకెందుకోయ్! మీసాలు గాని నువ్వు పెంచావంటే ఊరుకునేది లేదు... టేక్

కేర్...' డబ్బులు చేతికిచ్చి నిష్క్రమించాడు శ్రీనివాసరావు.

ఇదేం ఖర్మరా దేవుడా? కనీసం... మీసం పెంచుకోవటానిక్కూడా స్వేచ్ఛ... స్వాతంత్ర్యం లేదా ఇంట్లో? అని ఉడుక్కున్నాడు. ఏడుపొచ్చినంత పనైంది. కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి! మీసం తీసేయటం నామోషీగ ఫీలయ్యాడు

తండ్రితో వాదించి ప్రయోజం ఉండదన్పించి దొడ్లో బాదం చెట్టు దగ్గర బట్టలు ఉతుకుతూ కన్పించటంతో మమ్మీని సమీపించి బావురుమన్నాడు.

"ఏమైందిరా? ఆ ఏడుపెందుకు?" తలెత్తి కొడుకు ముఖంలోకి చూస్తూ అడిగింది. కామేశం కడగొట్టు వాడు కావటాన అతడి మీద తల్లికి కాస్తంత ప్రేమ ఎక్కువ.

'డాడీతో నువ్వయినా చెప్పు మమ్మీ! నేను మీసం గొరిగించుకోను!.... మనస్కరించటంలేదే ఎంచక్కామీసం పెంచుకోవటమంటేనే నాకిష్టం!....' గారం చేసాడు.

'నీ ముఖానికి మీసకట్టు కాస్తంత అందంగానే ఉంది లేరా పిచ్చిసన్నాసీ! పోన్లే... చక్కగా ఉంది కదా ఉంచేసుకో....'

'అందంగ ఉన్నప్పుడు నాన్న ఎందుకు తిట్టిపోయటం? తీసేయించుకోమంటూ డబ్బులు కూడా ఇచ్చారు! తీసేస్తే పేడి మూతిలా ఉంటుంది... అందరూ ఎగతాళి చేస్తారు.... స్నేహితులంతా ఏడిపిస్తారు....'

కొడుకుతో వాదించటానికి మనసొప్పక 'సరే పో! అన్నాగా! తర్వాత చూద్దాం' అని తల్లి అనటంతో ఇంట్లోకెళ్ళాడు.

ఇంట్లో ఆరోజంతా కామేశం మీసాల మీదే పెద్ద చర్చ! కుటుంబ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవటంతో చర్చలు కొలిక్కి రాలేదు. మరో రెండు మూడు సిట్టింగులు అవసరమన్పించింది.

ఏకాభిప్రాయం వచ్చేదాకా చర్చలే శరణ్యంగా భావించారంతా!

హమ్మయ్య! బ్రతుకు జీవుడాని ఊపిరి పీల్చుకోగలిగాడు కామేశం. మీసం మీద సీసం(సీస పద్యం) రాసిన కవులున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మీసాలున్న వ్యక్తి గిన్నీస్‌బుక్‌లోకెక్కిన విషయాన్ని కూడా టి.వి. ప్రోగ్రాంలో చూచాడు కామేశం! మీసాల మీద నిమ్మకాయలు నిలబెట్టే వారు ఉన్నప్పుడు... తనుమాత్రం మీసం

ఎందుకు పెంచకూడదు?- తీసేయమంటూ డాడీ పోరు పెట్టటం దేనికి? అంతా అయోమయంగ ఉన్నదన్పించింది కామేశానికి!

చక్రవర్తులకు... మహరాజులకు... సైన్యాధిపతులకు... సైన్యాధికారులకు... అందాకా ఎందుకు ఎందరో పోలీసులకు.. ఇంకా చెప్పాకోవాలంటే... టి.టి.డి చైర్మన్ ఎంఎల్‌ఏ కనుమూరి బాపిరాజు గారికి ఎంతెంత పెద్ద మీసాలు ల్లేవు?- మీసం దర్జానిస్తుంది. మనిషికి ధైర్యాన్నిస్తుంది. అందుకే పెంచటానికి నిర్ణయించుకున్నాడు. ఎవరెన్ని చెప్పినా వినదల్చుకోలేదు కామేశం.

పదవ తరగతిలో రాష్ట్ర స్థాయిలో ప్రథముడిగా ఉత్తీర్ణుడయిన కామేశం జీవన సరళే మారిపోయింది. తండ్రి కామేశం భుజం తట్టి అభినందించాడు. 'ఒరేయ్! మీసాలు ఉంచేసుకోరా! నీకు మీసాలు కలిసొచ్చినట్టుంది. తీసేయమని కొప్పడన్లే....' తన అభిమతాన్ని వ్యక్తం చేసాడు శ్రీనివాసరావు.

మీసాలను శాశ్వతంగ ఉంచుకోమని తండ్రి అన్నందుకు కామేశం ఆనందంతో పొంగిపోయాడు. అతని సంతోషానికి అవధుల్లేకుండా పోయినయ్.

× × × × ×

'ఒరే అబ్బీ!.... నువ్వు చేస్తోంది కంప్యూటర్ ఇంజనీరు. లక్షపైగా జీతం... కారు... స్టేటస్ ఉన్నయ్. అలాంటి నీకు మీసం అందాన్నివ్వటం లేదోయ్! కామెంట్ చేస్తున్నాననుకోకు! హరికథాపితామహుడిలా ఆ మీసాలేమిట్రా? నువ్వు చేసే జాబ్‌కి ఇంతంత పెద్ద మీసాలు ఎబ్బెట్టుగా ఉన్నయ్. ముస్టాష్ ట్రిమ్ చేసుకో... ముఖం కాంతివంతంగ మరింత కళ ఉట్టిపడుతుంది. బిలీవ్ మై వర్డ్స్!... రిటైరై ఇంట్లో కూర్చున్న శ్రీనివాసరావు కామేశానికి ఉచిత సలహా ఒకటి పారేశాడు.

'డాడీ - నా ఉద్యోగాన్నైనా వదిలేస్తానేమో గానీ... చచ్చే వరకు మీసం మాత్రం తియ్యను. ఐలైకిట్ వెరీమచ్! ఎన్నడూ... బ్లేడుగాని... కత్తిగాని మీసాన్ని తాకటానికి వీల్లేదు. దటీజ్ మై డిజైర్!! మీసం ఉంటేనే డాడీ మనిషిలో రోషం ఉండేది. అంతేకాదు... ఇది ఠీవి, దర్జాను కూడా ఇస్తుంది. మీకేం తెలీదు... మాట్లాడకండి...' తండ్రి సలహా కొట్టి పారేశాడు కామేశం.

'అద్సరే... రేపు ఈవినింగ్ మనం పెళ్ళి చూపులకు వెడుతున్నాం! నిన్ను నీ మీసావతారాన్ని చూచి ఆపిల్ల బెదిరిపోయి 'నో' చెప్పకుండా చూసుకో....' ఫక్కున

నవ్వేసి శ్రీనివాసరావు వీధిలోకి నడిచాడు.

× × × × ×

ప్రోగ్రాం ప్రకారం కామేశం సకుటుంబ సపరివార సమేతంగా కార్లో పెళ్లిచూపుల కోసం ఆడపిల్ల తండ్రి గారింటికి బయల్దేరాడు.

అమ్మాయి అబ్బాయి ఒకరినొకరు వందసార్లు కళ్ళార్పకుండా ఎగాదిగా చూసుకున్నారు. మొదట్లో అమ్మాయి నొసలు చిట్లించినా తర్వాత రాజీ పడినట్టు ముఖం పెట్టింది. కామేశానికి స్వాతి పిచ్చ పిచ్చగ నచ్చేసింది. ఇరుపక్షాల వారు తాంబూలాలు పుచ్చేసుకున్నారు.

కామేశం స్వాతిల వివాహం వైభవోపేతంగా జరిగింది.

హనీమూన్ కార్యక్రమం ఉంటుందని స్వాతి బోలెడంత ఆశపడింది. పెద్దలు అంగీకరించక పోవటంతో నీళ్లు చల్లినట్టన్పించింది. ఎంచక్కా మూడు నిద్రల కార్యక్రమంలోనే ఆ తంతు కాస్త ఆడపిల్ల వారింట్లో జరిపించేటందుకు నిర్ణయించారు.

మామ గారింట్లో మేడ మీద ఎ.సి.రూమ్‌లో శోభనం!

రాత్రి తొమ్మిది గంటల సమయంలో కామేశం పట్టుదీ పంచలాల్చీ ధరించి శోభనం గదిలోకి అడుగుపెట్టాడు! ఓహో... అరేంజ్‌మెంట్స్ అద్భుతంగ ఉన్నందుకు మామగారి టేస్ట్‌ని మెచ్చుకున్నాడు మనసులోనే.

మల్లెపూల దండలు వేలాడుతున్న డబుల్ బెడ్ మీదవెల్లకిలా పడుకుని ఎదురుగా ఉన్న నిలువటద్దంలో తన మీసాన్ని దువ్వుకుంటూ... తన్లోతాను నవ్వుకోవటంతో సరిపోతోంది. ఎంతకీ స్వాతి రాకపోవటంతో అసహనం ఆవహించింది.

ఇంతలో సెల్‌మోగింది. ముహూర్తం తొమ్మిది గంటల ముప్పై నిముషాలకు కాబట్టి ఆ సమయానికి అమ్మాయిని లోపలికి పంపుతాం! అందాకా ఓర్పు వహించండి అల్లుడుగారూ... అంటూ మామగారు దువ్వడంతో కామేశం స్థిమితపడ్డాడు.

ఈలోపు అక్కడున్న స్వీట్స్, పళ్లు తింటూ కాలక్షేపం చేసాడు.

సరిగ్గా ముహూర్తం టైముకి స్వాతి పాలగ్లాసుతో ఎంటరై తలుపు గడియపెట్టింది. నడిచొచ్చి భర్త సరసనే మంచం మీద కూర్చుని పాలగ్లాసు అందించింది.

'నాకేనా?!... తాగేస్తాలే...' తాగుతూండగ సహధర్మచారిణికి సగం పాలు మిగిల్చి ఇవ్వాలనే విషయం గుర్తుకొచ్చి గ్లాసుతిరిగి అందించాడు స్వాతికి. అందుకున్న గ్లాసులో పాల్లేకపోవటం గమనించి కామేశం ముఖంలోకి చూచి నవ్వు ఆపుకోలేక పకపకా నవ్వసాగింది.

కామేశం అయోమయంలో పడ్డాడు. స్వాతి ఎందుకు నవ్వుతుందో బోధపడక తెల్ల ముఖం వేసాడు.

'మహానుభావా... నా వంతు పాలు మీ మీసాలు తాగేసాయి. అద్దంలో చూచుకోండి....' కొంటెగ అంది.

తల అద్దం వేపు తిప్పాడు! తెల్లరంగు వేసినట్టు మీసాలు అగుపించటం చూచి నేప్కిన్‌తో తుడుచుకుంటూ 'సారీ స్వాతీ... ఇలా జరుగుతుందనుకోలేదు...' సిగ్గుపడ్డాడు.

'మీరు నచ్చారు. కానీ మీ మీసం నచ్చలేదు! అయినా మిమ్ములను పెళ్ళి చేసుకోవడానికి అంగీకరించాను- మీసమున్న మగాళ్ళంటే నాకు పరమ అసహ్యం!... రోత!!...' మనసులో మాట బయటపెట్టింది.

'సారీ స్వాతి... నా మీసాలను అత్యంత అపురూపంగా పెంచుకుంటున్నాను...' దగ్గరకు తీసుకుని ముద్దాడబోయాడు.

'ఆ‌(!... ఆ‌(!... దూరం దూరం! మీ మీసాల మూతితో నా బుగ్గను... నా పెదాలను... స్పర్శిస్తే వళ్ళంతా జలదరించి గొంగళి పురుగు పాకినట్టున్పిస్తుంది బాబూ!...'

'అంటే....' విస్తుపోయాడు.

'పెళ్లి చూపుల నాడే చెప్పాలనుకున్నాను. మీసాలు తీసేస్తే గాని మిమ్మల్ని పెళ్ళాడనని... కానీ సిగ్గన్పించటంతో నోరు విప్పలేకపోయాను. ఇప్పుడు చెప్తున్నాను... వినండి. మీరు మీసం తీసేస్తేనే ముద్దు ముచ్చట! అందాక మనిద్దరి మధ్య దూరం తప్పదు...' బిగి కౌగిలిని విడిపించుకుంటూ దూరంగ జరిగింది.

స్వాతి మాటలకు కామేశం ఖంగుతిన్నాడు. ఓరి దేవుడో... ఇదేంటి?... ఇట్లా మాట్లాడుతోంది. ముద్దు కోసం... ఎంతో ముద్దుగా పెంచుకున్న మీసాన్ని తీసేయుటమా? డైలమాలో పడ్డాడు. 'అంతవరకు నన్ను తాకటానిగ్గాని...

ముట్టుకోవటం గానీ నిషేధం...' కొంటెగ చూస్తూ అల్టిమేటం జారీ చేసింది స్వాతి.

బరువుగా తెల్లవారింది!

శోభనం గదిలోంచి బయటకొచ్చిన కామేశాన్ని చూసి మొదట తెల్లబొయ్యారు.

ఆతర్వాత ఫక్కున నవ్వారు

'ఒసేవ్! మనవాడిని చూడు! నేను మీసం వద్దురా అంటే విన్నాడా?!...' ఇప్పుడు పెళ్ళాం చెప్పిందో ఏమో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు... మన మాట కాదన్నా... పెళ్ళాం మాట కాదన్లేకపోయాడు పాపం...' కొడుకుని చూసిన శ్రీనివాసరావు పకపకా పెద్దగానే నవ్వాడు.

తల్లి జాలిగా చూసింది మీసం తీసేసిన కొడుకు కామేశాన్ని చూచి!

(చిత్ర - మంత్లీ మూర్చి 2012 సంచిక)